# త్రిశంకు స్వర్గం

ఎండాకాలం అవటం వల్ల, రాత్రి ఎనిమిది గంటలయినా, వెలుతురు పుష్కలంగా వుంది. విక్రమరావ్ ఆఫీస్‌లో జరిగిన తతంగం గురించి ఆలోచిస్తూ, డ్రెయివ్ చేస్తున్నాడు. హ్యూస్టన్ నగరంలోని విశాలమయిన రోడ్డు మీద - కారు వేగంగా పోతున్నది.

గత పదిహేనేళ్ళుగా సీనియర్ ఇంజనీర్‌గా బాగా పని చేస్తున్నందుకు మెచ్చుకుని, ఆ పని ఇంకొకరుచేసినా బాగుండదు, నువ్వే బాగా చేస్తానని, ఇంకా మెచ్చుకుని - మంచి అవకాశం వచ్చినా తనకి మేనేజర్‌గా ప్రమోషన్ ఇవ్వలేదు. ఏ మాత్రం అనుభవం లేని ఒక తెల్లవాడ్ని - ఇంజనీరింగ్ చదివినా, వైజ్ఞానిక జ్ఞానంలో సున్నా కనుక, మేనేజర్‌గా అయితే బాగా పని చేస్తాడని, ఎక్కువ డబ్బులిచ్చి, ప్రమోషన్ ఇచ్చి, తనకి పైన మేనేజర్‌గా చేశారు. విక్రమరావ్‌కి వచ్చిన కోపాన్నంతా గుటుక్కున మింగటం, పదిహేనేళ్ల నుంచీ అలవాటు అయింది కనుక - మళ్ళీ ఆ రోజు కూడా ఇంకోసారి కోపాన్ని దిగమింగేసి - కారు ఎక్కి ఇంటికి బయల్దేరాడు. కానీ ఆవేశం ఇంకా చల్లారలేదు - అందులోనూ ఆవకాయ తినే ఆంధ్రుడు కనుక, అంత తొందర్లో ఆ కోపం, ఆవేశం, ఉక్రోషం, కడుపు మంట, తగ్గేట్టు కనపడలేదు. అదే వర్గీస్‌తో అంటే - "ఇది వాళ్ల దేశం - వాళ్ల యిష్టం. మనం చేసేదేం లేదు. ఇష్టం లేకపోతే - 'పో' అంటారు. అప్పుడేం చేస్తావ్? అందుకే నాలాగా నోర్మూసుకు కూర్చో!" అన్నాడు, నోరు మూసుకు కూర్చుని.



"వీళ్ల దేశం ఏమిటి? ఇది నా దేశం కూడా - నేను అమెరికన్ సిటిజన్‌షిప్ తీసుకుని పదేళ్లయింది - ఆ తెల్లాడికి ఎన్ని హక్కులు వున్నాయో, నాకూ అన్నే ఇంకా ఎక్కువో హక్కులు వున్నాయి - ఇది అన్యాయం!"


"ఆ! వున్నాయండీ హక్కులు - ఎక్కడ? రాజ్యాంగంలో - వాటితో ఏం చేస్తావ్? - కోర్టుకి వెళ్లి

కంపెనీని "సూ" చేస్తావా? చేయి - లేనిపోని తల నొప్పులు తెచ్చుకో - తెచ్చుకుని స్ట్రెస్ లెవల్ పెంచుకుని, గుండె జబ్బు తెచ్చుకో - నా దగ్గరకు మాత్రం రాకు - ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్చమని ...." అన్నాడు వర్గీస్.

ఇదే మలయాళ దేశంలో అయితే, ఈ వర్గీస్ ఈ పాటికి ఉత్పత్తిని ఆపేసి, ఎర్రజండా పాతేసి, దేశాభివృద్ధిని ఒక అయిదేళ్లు వెనక్కి మళ్లించేవాడు కదా - ఎక్కడివాడు ఇక్కడికి వచ్చి, ఎలా అయిపోయాడో అనుకున్నాడు విక్రమరావ్. అనుకుంటూ కారుని నెమ్మదిగా పోనిస్తున్నాడు.

"ఏమిటి గురూ ... ఎక్కడివాడు ఇక్కడికి వచ్చి ... ఎలా అయిపోయాడు ... అని స్వాగతం చెబుతూ, ఆలోచిస్తున్నావ్!" అంటూ పక్క సీటులో ప్రత్యక్షం అయ్యాడు అమెరికా బేతాళుడు.

'అరే - నా మనసులో అనుకుంటున్నవి, నీకెలా వినబడ్డాయి...'అనుకోబోయి ఆగి, 'బేతాళుడు కదా ... వినపడక పోయినా, అన్నీ తెలుస్తాయి' అనుకుని, "రావయ్యా రా -



కనీసం నువ్వు పక్కనుంటేనయినా - నా వెర్రి ఆలోచనలు ఆపి కాస్త ప్రశాంతంగా వుండవచ్చు" అన్నాడు విక్రమరావ్.

బేతాళుడు నవ్వాడు - "నీ మనసులోని ఆలోచనలు అన్నీ అర్థం చేసుకున్నాను. అందుకే నీకు ఈ రోజు - నీ ఆలోచనలకు సరిపడే కథ ఒకటి చెబుదామను కుంటున్నాను -" అంటూ వెంటనే కథ మొదలు పెట్టేశాడు -

"ఈ కథ నిజంగా జరిగిన కథ - మొన్న శుక్రవారం రామ్ వాళ్ళింట్లో ఒక పార్టీ జరిగింది. మణిగారి చేతి వంట చాలా బాగుంటుంది కనుక, పిలిచిన వాళ్ళు బిగువు లేకుండా, పిలిచిన టైమకు ఒక పావుగంట ముందే సమావేశం అయ్యారు. "నాచో" చిప్స్ రెడ్ హాట్ పికాండే సాస్‌తో నంజుకుని తినేసరికి, వివిధ విషయాల మీద చర్చలు హాట్ హాట్‌గా మొదలయాయి" ఆగాడు అమెరికా బేతాళుడు.

"నీ దుంపతెగా - మళ్ళీ తిండి సంగతి మొదలుపెట్టావూ - అసలే ఆకలితోనూ, కడుపు మంటతోనూ, కడుపు కాలి చస్తుంటే ..." అన్నాడు విక్రమరావ్.

"వీకెండ్ పార్టీల్లో చర్చల గురించి చెప్పేటప్పుడు, కాస్త ఆహార వ్యవహారాల గురించి కూడా చెప్పటం, కనీస ఆతిథ్య ధర్మం నాయనా! సరే - అసలు కథకి వద్దాం. ఈ అమెరికా దేశంలో, హ్యూస్టన్ నగరంలోని తెలుగు మిత్రులు కలసి మాట్లాడుకుంటున్నప్పుడు - శంకర్ అన్నాడు - "మా అమ్మాయి పోయిన సంవత్సరం ఇండియా వెళ్ళినప్పుడు ఆగ్రా, ఢిల్లీ, జయపూర్, బెంగుళూరు, తిరుపతి అన్నీ చూసి వచ్చింది. అప్పటి నుంచీ ఇండియా అంటే ఇష్టపడటం మొదలుపెట్టింది. మా ఆవిడకి ఎప్పుడూ ఇండియాలోనే సెటిల్ అయిపోవాలని - నాకూ మొదటి నుంచీ అంతే -"

రమేష్ వెంటనే అందుకున్నాడు - "ఈ కబుర్లు చెప్పకండి సార్ - మీరు దాదాపు పదేళ్ల నుంచీ అదే మాట చెబుతున్నారు. ఇండియా పోవాలి, అక్కడే వుండిపోవాలి, అది మన మాతృభూమి - మట్టిగడ్డా - ఈ కబుర్ల వల్ల ఏమీ ప్రయోజనం లేదు - వెళ్ళి సెటిల్ అయిపోయి చూపించండి" -

రామ్ అన్నాడు -- "అవును - మీ అమ్మాయి ఏదో విజిట్‌కి వెళ్లి ఇష్టపడటం వేరు, అక్కడే సెటిల్ అయిపోవటం వేరు. ఈ దేశం వచ్చి, ఇన్నేళ్లు వుండి, ఈ సుఖాలకు అలవాటు పడి - మళ్లీ అక్కడ సెటిల్ అవాలంటే చాల కష్టం అండీ!"

"అదే పొరపాటు" - శంకర్ అందుకున్నాడు, "నేను అక్కడ ముప్పయి అయిదేళ్ళు వుండి, ఇక్కడికి వచ్చాను. మా వాళ్లంతా అక్కడే వున్నారు. ఇంకా మాకు ఆ బంధాలు, అనుబంధాలు వున్నాయి -" ఒక్క క్షణం ఆగి మళ్లీ అన్నాడు - "అక్కడ వున్నప్పుడు, క్రికెట్ మాచెస్, తెలుగు నాటకాలు, తెలుగు సాహిత్యం, కర్ణాటక సంగీతం, పెసరట్లు - ఉప్మా, రవ్వదోశా, -- సాయంత్రం పూట గుంటూరు తొమ్మిదో లైను సెంటర్‌లో మిత్రుల సమావేశం, వన్ బై టూ కాఫీ - నాగయ్య కొట్టు మిఠాయి కిళ్లీ, శేషమహల్‌లో సెకండ్‌షో - అసలా

జీవితమే వేరండీ - ఇక్కడ, ఒకటే పరుగు - ఆరాటం - నిత్యపోరాటం."

కృష్ణారెడ్డి అంటున్నాడు - "కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీలో వున్నప్పుడు - వుయ్ హాడ్ ఏన్ ఎక్సలెంట్ లైఫ్ - ఐ డోంట్ గెటిట్ ఎగైన్" -

"అవన్నీ ఆ రోజుల్లో మాష్టారూ - ఇప్పుడు అక్కడా మారిపోయాయి. ఎక్కడ చూసినా మనుషులు, దుమ్ము, మట్టీ - అంతేకాదు - ఆంధ్రాలో కరెంటు వుండదు - నీళ్లు వుండవు - ఎక్కడ చూసిన లంచం, అరాచకం - అదో నరకం అనుకోండి -" అన్నాడు రామ్.

"ప్రాబ్లెమ్స్ ఇక్కడా వున్నాయండీ - ప్రొద్దున కారులో ఆఫీసుకి వెళ్లిన వాళ్ళు - సాయంత్రం ఇంటికి వచ్చేదాకా అనుమానమే. కారు ప్రమాదాల్లో రోజుకి ఎంతమంది చస్తున్నారు అమెరికాలో. ఏ షాపులో వున్నప్పుడు, ఎవడు 'గన్' తీసి పేలుస్తాడో తెలీదు. ఇక్కడ క్రైమ్ వుంది కానీ, పనిష్మెంట్ లేదు మరి - పది మందిని చంపినవాడు, జైలుకు పోయి, పదేళ్ళలో 'మంచి' నడవడిక వలన, పెరోల్ మీద బయటకు వస్తున్నాడు. ఇక్కడ ప్రతి రోజూ చస్తామేమో అన్న భయంతో బ్రతికేకన్నా, కరెంటు లేకపోయినా, నీళ్లు లేకపోయినా ఇండియాలోనే నయం. కనీసం బతికుంటే బలుసాకు తిని వుండవచ్చు -" అన్నాడు కృష్ణారెడ్డి.

"అక్కడ క్రైమ్ తక్కువ వుందనా - సెకెండ్ షో నించి మీరు, మీ ఆవిడా విజయ వాడలో రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్లగలరా ఈ రోజుల్లో - కులాల మద్దతుతో పార్టీలు పెట్టి, సినిమాలు చూపించి - పదవులు సంపాదించి, రామరాజ్యం బదులు కుల క్షేత్రాలు సాగించి, మనుషులూ, విలువలూ, శాంతీ, న్యాయం ఏమీ లేకుండా, డబ్బూ, పదవీ కోసం దేశాన్నే నాశనం చేశారు కదండీ - హిందూ ముస్లిమ్‌ల గొడవలు పెట్టి దేశాన్ని చిన్నాభిన్నం చేస్తున్న అతి ప్రమాద మతవాదులూ, కమ్యూనిష్టు దేశాల్లోనే కమ్యూనిజం చచ్చిపోయినా, మనకింకా కమ్యూనిజం కావాలనే కమ్యూనిస్టు కోటీశ్వరులూ- వీళ్లందరూ మిమ్మల్ని క్షేమంగా బ్రతకనిస్తారా అక్కడ -" రమేష్ ఆవేశంగా అన్నాడు.

మణిగారు వచ్చి - "భోజనాలు రెడీ - రండి" అన్నారు.

"వాళ్ళు మంచి హాట్ టాపిక్‌లో వున్నారండీ - ముందు ఆడవాళ్లం, పిల్లలం తిందాం - తరువాత వాళ్లకి, ఆకలిగా వుంటే వస్తారు - లేకపోతే ఒకళ్లని ఒకళ్లు తింటూ వాదించుకుంటారు"అన్నది రమణి. ఆవిడ రమేష్ భార్య. నాలుగుసార్లు, అతన్ని నోరు మూసుకోమని, సంజ్ఞలు కూడా చేసింది. ఆయన చూశాడు కానీ, చూడనట్టు నటించి, మాటల్లో పడ్డాడు" - బేతాళుడు ఆగాడు.

విక్రమరావ్ ఇంటర్ స్టేట్ ఫ్రీ వే టెన్ మీద నుంచీ కారు, టెక్సాస్ హైవే సిక్స్ మీదకు తిప్పుతూ, "నా మనసు బాగాలేక కాస్త ప్రశాంతంగా వుందామనుకున్నాను. నువ్వు వచ్చి, నన్నింకా గాభరా పెట్టేస్తున్నావు-"అన్నాడు బేతాళుడితో.

బేతాళుడు నవ్వాడు - "ముళ్లపూడి వెంకట రమణ పుస్తకం అనుకుంటాను - మేభి

- రాజకీయ బేతాళ పంచవింశతిక అయివుండాలి. దాంట్లో అన్నీ రాజకీయాలే కనుక, చదువరులకు బోరు కొడుతుందని, ఒక పేజీలో చక్కటి బాపూ బొమ్మని వేశారు. మరీ సీరియస్ అయిపోయినప్పుడల్లా, ఒకసారి ఆ బొమ్మని చూసి, మనసాహ్లాద పరుచుకుని, మళ్లీ చదవటం కొనసాగించమని రాసినట్టు కూడా గుర్తు!"

"అది సరే కానీ, చక్కటి బాపూ బొమ్మ ఏమిటి నీ శ్రార్థం. రెండు సూపర్ లెటివ్స్ వాడావు. బాపూ బొమ్మ అంటేనే చక్కటిది అని అర్థం - మళ్లీ చక్కటిది అనవలసిన అవసరం లేదు!" అన్నాడు విక్రమరావ్.

"ఏదో లేవోయ్ చెవలాయ్ - అమెరికా బేతాళుడిని కనుక నాకు తెలుగు అంత చక్కగా రావలసిన అవసరం లేదు - సరే - ఒక్క క్షణం ఆగు -" బేతాళుడు మాయమయి, ఎదురుగా వున్న బుక్‌షాప్‌లో ప్రత్యక్షం అయి, తక్షణం అక్కడ మాయమయి, కారులోకి దూకాడు వెంటనే. అతని చేతిలో 'ప్లేబాయ్' మాగజైన్ వుంది.

"నా కథ, నిన్ను మరీ టెంషన్‌లో పెడుతుంటే, ఇదుగో ఈ పుస్తకంలో సెంటర్ ఫోల్డ్ చూడు - చక్కటి అమ్మాయి నీలాంటి వాళ్ళ కోసం, వళ్లు దాచుకోకుండా, అందాన్ని ఆనందంగా అర్ఘవం చేస్తున్నది -" అన్నాడు 'ప్లేబాయ్'ని విక్రమరావ్ ఒళ్లో పడేసి.

విక్రమరావ్ కొంచెం సిగ్గుపడీ, పడనట్టూ నటిస్తూ, "సరేలే - ఇది చూస్తూ కారు నడిపితే, ఆక్సిడెంటు అయి మన వళ్లు మనం దాచుకోటానికి మిగలదు. కథ పూర్తి చేయి --" అన్నాడు.

బేతాళుడు కథ చెప్పటం సాగించాడు.

"రమేష్, రాములు ఒక ప్రక్క, శంకర్, కృష్ణారెడ్డి ఇంకో ప్రక్కా వుండి, చాలా తీవ్రంగా వాదిస్తున్నారు. అందరు చెప్పేదాన్లోనూ నిజాలు వున్నాయి - ఈ కథని ఇంకా కొంచెం చెప్పి, నేనొక ప్రశ్నని అడుగుతాను. నువ్వు పట్టువదలని విక్రమార్కుడిలాగా, దానికి సరిఅయిన సమాధానం చెప్పాలి. తెలీక తప్పు చెప్పినా తెలిసి నోరు మూసుకు కూర్చున్నా --"


"తెలుసు లేవోయ్ - ఇది అమెరికా బేతాళుడి కథల్లో నాలుగో కథ - అంటే కనీసం మూడు సార్లు ఈ సంగతి చెప్పాం. మళ్లీ చెప్పఖ్ఖర లేదు. నేను సమాధానం చెప్పకపోతే, నా కారు టైర్లు నాలుగూ డామ్మని పగిలిపోతాయి. నా కారు రోడ్డు మధ్యలో ఆగిపోతుంది. మన వెనుకనే 60 మైళ్ల స్పీడుతో వస్తున్న, ఎక్సాన్ ఆయిల్ కంపెనీవారి పద్దెనిమిది చక్రాల ట్రక్, నా మీద నుంచి వెళ్ళిపోతుంది - కథ కాలిఫోర్నియాకి - నేను ---"

"ఆ మాట అనకు బాబూ -- నాకు అమెరికాలో వున్న విక్రమార్కుడివి, నువ్వు ఒక్కడివే - అయినా నీ తెలివితేటల మీద నాకు నమ్మకం వుందిలే --"

"సరే - ఆపు నీ సుత్తి - సాగించు నీ కథ" అన్నాడు విక్రమరావ్, ఎర్రలైటు దగ్గర కారు ఆపి.

బేతాళుడు - సీరియస్‌గా మళ్లీ కథ చెప్పటం సాగించాడు. విక్రమరావ్ వింటూ, క్రీ గంటితో ప్లేబాయ్ పిల్ల అందాలను చూస్తూ, చూడనట్లు నటిస్తున్నాడు.

"నేను కనీసం ఒక పాతిక మందిని చూశాను. ఇండియాకి పోతాం, పోయి సెటిల్ అయిపోతాం, అమెరికాలో వుండలేం అంటూనే వుంటారు. కానీ పోరు. ఇంకా కొంచెం సంపాదిస్తేనే కానీ వెళ్లలేం అని కొన్నాళ్లుంటారు. మా పిల్లల స్కూలు అవాలి అని కొన్నాళ్ళుంటారు. మా అబ్బాయికి హార్వర్డ్‌లోనో, స్టాన్‌ఫర్డ్‌లోనే సీటు వచ్చింది. వాడు ఇక్కడ వుంటే మేం ఇండియాలో ఏం చేస్తాం అని ఇక్కడే వుంటారు. అమెరికాని తిడతారు. కానీ అమెరికాని వదలరు. వీళ్లకి కార్లు కావాలి, పెద్ద ఇళ్లు కావాలి, శుభ్రమైన నీళ్లూ, గాలీ, ఆహారం,



వాతావరణం అన్నీ కావాలి. అందుకే ఇండియా వెళ్లరు. వీళంతా హిపోక్రాట్స్ మాష్టారూ!" అన్నాడు రమేష్.

"నేను ఒప్పుకోను - నేను త్రివేండ్రంలో రాకెట్ స్టేషన్‌లో పని చేసేటప్పుడు అక్కడ చూశాను - కనీసం ఒక ఇరవై మంది స్నేహితులు వున్నారు నాకు. వాళ్ళు ఇంగ్లాండ్‌లోనూ, అమెరికాలోనూ, ఫ్రాన్స్‌లోనూ చాలా ఏళ్లు పనిచేసి, ఇండియా తిరిగి వచ్చేశారు. హాయిగా వున్నారు అక్కడ. సముద్రపు ఒడ్డునే హౌసింగ్ కాలనీ. అక్కడా స్వచ్ఛమైన గాలీ, నీరూ - వాతావరణం. మీ మనసుని మీరు కంట్రోల్ చేసుకోలేక, అమెరికా అందించే సుఖాలే శాశ్వతం అనుకుని, మీ దగ్గర బంధువులని దూరం చేసికుని, మీ నిస్సహాయతను కవర్ చేయటం కోసం కథలు చెబుతున్నారే, మీరూ - హిపోక్రాట్లు" అన్నాడు కృష్టారెడ్డి.

"వాళ్లు సుఖంగా ఉన్నారని మీరు అనుకుంటున్నారు - అంత ధృఢ నిశ్చయంతోనూ ఇండియా తిరిగివెళ్ళి, ఒక సంవత్సరంలో పారిపోయి అమెరికా వచ్చేశాడు మా మిత్రుడొకడు. వాళ్ళ పిల్లలకు అక్కడ నచ్చలేదు. వాళ్లావిడకు ఆ నీళ్లు పడక ఆరోగ్యం దెబ్బతింది. ఆయన చేరిన కంపెనీలో కుల రాజకీయాలు, కుతంత్రాలు భరించలేక పారిపోయి వచ్చేశారు-" అన్నాడు రామ్.

శంకర్ అందుకున్నాడు - "మరి సుబ్బారావ్‌గారి సంగతి ఏమిటి? - వాళ్లావిడ అమెరికాకు వచ్చాక, అసలు వుండలేకపోయింది. చివరకు ఇద్దరూ కలసి ఇండియాకి వెళ్లిపోవటమో, లేకపోతే విడిపోయి, అతను అమెరికాలో, ఆవిడ ఇండియాలో వుండటమో అని పంతం పట్టింది. చివరకు ఇద్దరూ ఇండియా వెళ్లిపోయి, ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ పెట్టుకుని హాయిగా వున్నారు. మరి దానికేమంటారు?"

మణిగారు వచ్చి - "మా అందరి భోజనాలు అయిపోయాయి. ఇక మగవాళ్ళు మిగిలారు రండి" అన్నారు.

రమణి కూడా వచ్చి, "రాకపోతే గిన్నెలు కడిగేస్తాం. మీ వీకెండ్ చర్చలు ఇంతటితో సమాప్తం -" అన్నది పూర్వం పన్యాల రంగనాథరావ్ - వార్తలు ఇంతటితో సమాప్తం అన్నట్టుగా.

"అందరూ - ఇక చర్చలు ఆపి పులిహోరా, గోంగూరా, వంకాయ కూరల మీద పడ్డారు" - ఆపాడు బేతాళుడు.

"నీ దుంపతెగా - అసలే ఆకలితో చస్తూంటే - మళ్లీ --" అంటున్న విక్రమరావ్‌ని ఆపి, బేతాళుడు అన్నాడు -

"సరే ఇన్ని వాదాలు విన్న తర్వాత - అమెరికా బేతాళుడ్ని నాకే గందరగోళంగా వుంది. అందరు చెప్పేదీ నిజంలాగానే కనిపిస్తున్నది. వాళ్ల వాదాల్లో నిజాయితీ వుంది కానీ అభిప్రాయాలన్నీ, ఒకదాన్ని ఒకటి ఖండిస్తున్నాయి - ఇదెలా సాధ్యం? -- ఎక్కడో ఏదో లోపం వుంది - జవాబు తెలిసీ చెప్పకపోతే -- నీకు తెలుసు - ఏమవుతుందో--" ఆగాడు బేతాళుడు.

విక్రమరావ్ రెండు క్షణాలు ఆలోచనలో పడ్డాడు. ప్లేబాయ్ పుస్తకం, వెనక సీట్లోకి విసిరేశాడు. గొంతు సవరించుకుని, అన్నాడు - "అవును - నువ్వు చెప్పింది నిజమే! - అందరి మాటల్లోనూ నిజాలు వున్నాయి. నాకు అలాంటి వారు ప్రత్యక్షంగా తెలుసు. ఇండియా నించి ఇక్కడకు వచ్చి చదువులు పూర్తి చేసుకుని, లేక కొన్నాళ్లు ఇక్కడ పనిచేసి ఇండియాకు వెళ్లి అక్కడ సెటిల్ అయిపోయినవాళ్లు వున్నారు - అలాగే మళ్లీ వెనక్కి వెళ్లటం ఇష్టం లేక, ఇక్కడే వుండిపోయి సుఖంగా వున్నవాళ్ళు వున్నారు. నన్నడిగితే, ఈ రెండు రకాల వాళ్ళూ అదృష్టవంతులు. వాళ్లు అనుకున్నవి చేయగలుగుతున్నారు. ఇక ఇంకో రెండు రకాలవాళ్లు వున్నారు. వాళ్లు ఇండియా వెళ్లిపోయి, అక్కడ బంధుమిత్రులతో వుండాలనే ఉద్దేశ్యంతో

వుంటారు. ఐదేళ్ళు, పదేళ్ళు, ఇరవై ఏళ్ళూ -- ఎంత ధృడ నిశ్చయం వున్నా రకరకాల కారణాల వల్ల వెనక్కి వెళ్ళలేరు. పిల్లల చదువులు, ఉద్యోగంలో వున్నతమైన స్థాయి, సాంకేతికంగా జ్ఞానాభివృద్ధి, వెనక్కి వెళ్లలేకపోవటం లాంటి చాల గట్టి కారణాల వల్ల వాళ్ళు వెళ్ళలేక పోతున్నారు. వాళ్ళు ధృడ నిశ్చయంతో ఇండియాకి వెళ్లినా, మళ్లీ అమెరికాకు తిరిగివచ్చే అవకాశాలు కూడా వున్నాయి. నాలుగో రకం - ఇక్కడ వుండటానికే ఇష్టపడ్డా, వేరే కారణాల వల్ల ఇండియా వెళ్లి అక్కడ సెటిల్ అయిపోయేవాళ్ళు. మళ్లీ ఇక్కడకు రావాలనే కోరిక, అంతర్గతంగా వుండటం వల్ల, వాళ్లు అక్కడా సుఖంగా వుండలేరు. ఈ ఇన్ని రకాల మనస్థత్వాల్లోనూ వున్నది హిపోక్రసీ కాదు. అది మానవ సహజమయిన ఒక బలహీనత. కానీ వాళ్లని ఛాలెంజ్ చేస్తూ మాట్లాడుతున్నారే, వాళ్లదీ హిపోక్రసీ. నేను ఇండియా నుంచి, అమెరికా వద్దామని అనుకునేటప్పుడు - ఇరవై ఏళ్ల క్రితం - నా ఆలోచనలు ఎన్నో విధాలుగా, ఎన్నో దిక్కులకు పోయాయి. నేను చేస్తున్నది మంచా, చెడా, భవిష్యత్తుని ఎటు నడిపిస్తున్నానా అనే ఆందోళన నన్ను రాత్రింబగళ్లూ కలవరపరిచింది. పై చదువుల కోసం, వైజ్ఞానికంగా ఎక్కువ ఎత్తులకు ఎదగటం కోసం, ఆర్థికంగా నిలదొక్కుకోవటం కోసం - రకరకాల కారణాలతో ఇక్కడకు వద్దామనుకుంటారు. ఆ సమయంలో వాళ్ల మనస్సుల్లోని కల్లోలం, మాటల్లో చెప్పటం చాలా కష్టం. అదే రకంగా, ఇక్కడ చాలా సంవత్సరాలు వుండి, వెనక్కి వెళ్లటం అంతకన్నా పెద్ద సమస్య. ప్రతి రాత్రీ నిద్ర పట్టక, ఆలోచనలతో ఆరోగ్యం పాడు చేసుకున్నవాళ్లు కూడా వున్నారు. వాళ్లని ఛాలెంజ్ చేయటం కాదు, స్నేహితుడిగా ఎవరయినా చేయవలసింది - వాళ్ల జీవితంలో, వాళ్ల ఆనందం కోసం, సుఖం కోసం, వాళ్లు తీసుకునే నిర్ణయం, పూర్తిగా వాళ్లదే అయివుండాలి. ఆ ఆలోచనా స్రవంతిలో, వాళ్లకి కావలసిన మానసిక సహాయం, ఆత్మస్థైర్యం ఇచ్చి, వాళ్లది - ఎలాంటి నిర్ణయమైనా - ఉత్సాహపరచటమే నిజమైన స్నేహితులు చేయవలసింది. నా వుద్దేశ్యంలో రామ్, రమేష్‌లు - ఆవేశంతో కూడిన ఈ వాదనలు ఆపేసి, ఆవకాయ భోజనం చేయటం, అందరికీ మంచిది" జవాబు చెప్పటం పూర్తిచేసి, ప్రక్క సీట్లోకి చూశాడు విక్రమరావ్.

ప్రక్క సీట్లోని బేతాళుడూ, వెనక సీట్లోని 'ప్లేబాయ్' పుస్తకం - అంతర్ధానమవటం - విక్రమరావ్ కారు ఇంటి దగ్గర ఆగటం ఒకేసారి జరిగాయి.

❖